# వెలుగుపూలు

-బి.మాధవి

బస్సు గాజులపల్లి క్రాస్‌రోడ్డులో ఆగింది.

సురేఖ బస్సు దిగి పరిసరాల్ని గమనించసాగింది.

రోడ్డుకు ఎడమవైపున వరుసగా ఆరేడు టీ కొట్లు ఉన్నాయి. అవన్నీ కేవలం బస్సు దిగి ఎక్కే వాళ్ల కోసమే అన్నట్లున్నాయి. అక్కడ ఊరులేదు. జనాల హడావుడి అంతగా లేదు. హోటళ్ల నుంచి పెద్ద శబ్దాలతో సినిమా పాటల రొద వినిపిస్తూ వుంది. సురేఖతో వచ్చిన ఆమె భర్త జిల్లేడుకుంటకు దారి ఎటోనని సందిగ్ధంలో ఉన్నాడు. సురేఖ వైపు తిరిగి 'అటా? ఇటా?' అన్నట్లు సందేహించాడు.

"అడిగితే పోలా?" అంది సురేఖ. ఇద్దరూ టీ కొట్టువద్దకు వెళ్లి టీ తీసుకున్నారు. "జిల్లేడుకుంటకు దారెటు?" అన్నాడు పరమేశ్వర్.

"ఈ తారురోడ్డు వెంబడి రెండు కిలోమీటర్లు పోతే అక్కడ ఎడమవైపు బండ్ల దారొస్తుంది. ముందు గాజులపల్లి వస్తుంది. అన్నించి మూడు ఫర్లాంగులు వెళ్తే ఆ కొండ కింద గుడిసెలు కనిపిస్తాయి. అదే జిల్లేడుకుంట" అంటూ వివరించాడు టీకొట్టాయన.

బ్యాగ్ చేతిలోకి తీసుకుంటూ ఉండగా "ఎవరింటికయ్యా?" అన్నాడు ఆయన.

"నా భార్య టీచరు. ఆవిడను జిల్లేడుకుంటకు బదిలీ చేసారు. ఈ రోజు జాయినవ్వాలని వస్తున్నాం" అని చెప్పి తారురోడ్డు వైపు కదిలారు ఇద్దరూ.

తారురోడ్డు దిగి బండ్లదారి వచ్చింది. దారికి రువైపులా రాగి పంట పండించిన గుర్తుగా కొయ్యలున్నాయి.

దారి పొడవునా రక్షణకన్నట్లు ముళ్లపొదలు. అక్కడక్కడ వెళ్లేందుకు కంచెలు... దూరాన ఇద్దరు మనుషులు కనిపిస్తున్నారు. బండి మీద నుంచి వామివైపు కట్టలు విసిరేస్తుంటే పైన ఆయన వాటిని కళాత్మకంగా పేరుస్తున్నాడు. ప్రాశ్చాత్య సంస్కృతులేవీ ఇంకా పూర్తిగా అంటని ప్రాంతంలా తోచింది సురేఖకు.

"ఇక్కడ ఎన్నాళ్లు పని చేస్తావు నువ్వు?" అన్నాడు.

"మళ్లీ బదిలీ వచ్చేదాకా?" అంది.

"ఎంఆర్‌పి చేస్తూనే వున్నావు. అది బాగానే వుందిగా. ఎందుకింత మూలన పడిన ఊరికి రావడం" అన్నాడు.

"కమీషనర్ ఉత్తర్వుల మేరకు జిల్లాలో కొన్ని కుగ్రామాల్ని దత్తత తీసుకుని వాటికి మంచి మార్పు తెచ్చే టీచర్లను వేయాలన్నది నియమం. అందులో భాగమే ఈ బదిలీ" అంది సురేఖ.

"ఏం బదిలీలో ఏమో?" విసుక్కున్నాడాయన.

గాజులపల్లి దాటి వెళ్లారు. చిన్న కాలిబాట. అక్కడక్కడ కంపచెట్ల మధ్య కొందరు ఆడవాళ్లు పుల్లలు ఏరుకుని మోపులు కడుతున్నారు. వైశాఖంలోంచి జేష్ఠంలోకి వెడుతున్న రోజులు. ఎండ తీవ్రత చుర్రుమంటూ ఉంది. ఈ ఎండలో వాళ్లు ఎలా మోసుకెళ్తారో అనుకుని వెంటనే తప్పదు కదా... అదే వారి జీవితం కదా అనుకుంది.

వారికి ముందుగా ముగ్గురు ఆడవాళ్లు నెత్తిన మోపులు పెట్టుకుని ఊరివైపు వెళ్తున్నారు. ఒళ్లంతా చెమట్లు. రవికెలు పూర్తిగా తడిసిపోయి ఉన్నాయి. చీరలోని పమిట భాగాన్ని చుట్టగా చుట్టి నెత్తిన పెట్టుకుని అది జారకుండా తాడితో బిగించారు. శరీర భాగాల్లో ఎక్కడా మెరుపు కనిపించలేదు. శరీర పోషణకు, రక్షణకు ప్రత్యేక చర్యలేవీ తీసుకున్నట్లు లేదు. ఇలాంటి దృశ్యం చూడక ఎన్ని రోజులైందో అనుకుంది. ఇంకా సేపు అలాగే చూడాలనిపించింది.

జిల్లేడుకుంటలోకి ప్రవేశించారు. మనుషులంతా చూస్తూనే వున్నారుకానీ 'ఎవరు కావాలని' ఏ ఒక్కరూ అడగలేదు. కొన్ని ఇళ్లు దాటి వెళ్లారు.

కొంచెం పెద్దగా ఉన్న గుడిసె కనిపించింది. వాకిట్లో ఎదురుగా మంచంమీద పెద్దాయన మజ్జిగన్నం జుర్రుకుంటున్నాడు. అతను వీళ్లవైపు చూసాడు. మళ్లీ కొట్టంలోకి చూసాడు.

"ఒరే సోమ్లా! మీ నాయనని పిల్చు. ఎవరో వచ్చినారని చెప్పు" అని తన పనిలో తాను ఉండిపోయాడు. తాతయ్య మీసాలకున్న మజ్జిగన్నం నవ్వు తెప్పించింది సురేఖకు. సోమ్లా రెండు గుడిసెల అవతలకు వెళ్లి నాన్నను వెంటబెట్టుకుని వచ్చాడు. పరిచయాలు చేసుకున్నారు.

ఆయన పేరు మూనే నాయక్. నలభై ఐదు ఏళ్లు పైనే ఉంటుంది వయస్సు. జుట్టు ఎర్రగా ఉంది. కాస్త పిల్లికళ్లు. చేతులపైన, ఒంటిమీద వెంట్రుకలు ఎర్రగా ఉన్నాయి.

విషయమంతా విన్నాక "ఏం చేయాల్నో చెప్పండి" అన్నాడు.

"రేపట్నించి ఈవిడ ఇక్కడే ఉంటుంది. కాస్త వసతి చూపించి పిల్లల్ని తనకు పట్టిస్తే నాలుగు ముక్కలు నేర్పిస్తుంది. పిల్లలు ప్రయోజకులవుతారు" అని వివరించాడు.

"ఇంతకుముందు వచ్చినోళ్లు కూడ ఇట్లే జెప్పినారు. నాలుగు నాళ్లుండి చెప్పకుండానే పోయినారు. అయినా మేము యాడ సదివిస్తాం. సేసుకోనీకి తిన్నీకి సరిపాయ. వీళ్లను సదివీనికి లెక్కలు కావాల. మాకు తిన్నీకే లేకుంటే సదివీనికి యాన్నుంచి వస్తుంది" అంటూ ఇంకా ఏవేవో ఆర్థికపరమైన ఇబ్బందులకు సంబంధించిన విషయాలు పూస గుచ్చినట్లు వివరించాడు.

ఈ ఇబ్బంది చిన్న సంసారం నుంచి పెద్ద దేశాల వరకూ ఉన్నదే అనుకున్నాడు పరమేశ్వర్.

ఆయన చెప్పిన మాటలు వింటూనే ఉన్నాడు. ఆ మాటల్లో అంతర్జాతీయానికి సంబంధించిన ఎన్నో విషయాలకు సంబంధం ఉన్నట్లు తోచింది.

సురేఖకు మళ్లీ తను చదివిన చరక సంహిత గుర్తుకువచ్చింది.

అప్పటితోమాటలు ముగించి పరమేశ్వర్ తిరుగు ముఖం పట్టాడు.

***

మరుసటిరోజు సురేఖ స్కూలు రికార్డులు తెప్పించుకుని చూడసాగింది. రిజిస్టర్‌లో పేర్లు చదవసాగింది. మాంగ్యానాయక్, రామాసినాయక్, తావూనాయక్, హేమ్లానాయక్, చింటోడు, సర్పి, భీమ్లానాయక్, సోమ్లానాయక్... అన్నీ ఇలాంటి పేర్లు. అమ్మాయిల పేర్లు చదవసాగింది. పావులమ్మ, ధర్మణి, బుజ్జి, బుజ్జమ్మ, మంత్రెమ్మ, దేవిలి, చిట్టెమ్మ, మంగమ్మ, కిస్త్రి, యేరమ్మ, పేరమ్మ...లాంటివి కనిపించాయి. ఏ పేరులోనూ నూతనత్వం లేదు. వీళ్లకు పేర్లు తెలియవా అనిపించింది.



రమ్య, సౌందర్య, కవిత, సాహితి, పావని, పవిత్ర... ఇలాంటి అందమైన పేర్లున్నాయి. అలాంటిదొక్క పేరు కూడా కనిపించలేదు. ఎంతో మరి అనుకుంది సురేఖ.

సమయం తొమ్మిది దాటింది. పాత కుర్చీని విదిలించుకుని కూర్చుంది సురేఖ. కాసేపటికి మూనేనాయక్ వచ్చాడు.

"అన్ని గుడిసెల్లో చెప్పినానమ్మా. అందర్నీ పనులకు పంపినారంట.ముందే చెప్పింటే బాగుండు. రేపొస్తారులేమ్మా" అంటూ వెళ్లాడు.

'రేపు చూద్దాం' అనుకుంది.

తర్వాతి రెండురోజులు కూడా మూనేనాయక్ వచ్చాడు. చెప్పిందే చెప్పి వెళ్లాడు. ఇలా కాదనిపించింది సురేఖకు.

మరుసటి రోజు ఉదయం అందరూ ఇళ్ళవద్ద ఉండాలని, పిల్లల్ని తీసుకుని తనవద్దకు రమ్మని చెప్పింది. చాలామందే వచ్చారు. అందరివైపు చూస్తూ మనసులోని భావాల్ని వివరించింది.

"మీరు కష్టపడి పని చేస్తున్నారు. సంతోషం. మీ పిల్లలూ కష్టపడి పని చేస్తున్నారు. చాలా సంతోషం. వారి పిల్లలు ఇంకా కష్టపడి పని చేస్తారు. ఇంతేనా... తరాలుగా ఇలాగే వుంటే ఎలా. మీ పిల్లల్ని నావద్దకు పంపండి. చదువు నేర్పుతాను. జ్ఞానం పెరుగుతుంది. బయట ప్రపంచం తెలుస్తుంది. వారి జీవితాల్లో వెలుగు నిండుతుంది" అంది.

అందరివైపు చూసింది. ఏ ముఖంలోనూ చిల్లిగవ్వంత నవ్వులేదు. చెప్పింది ఏమిటో కూడా అర్థమైనట్లులేదు. శిల్పాల్లా కూర్చుండిపోయారు.

"పిల్లల్ని చదివించుకోవాలనే ఒక నిర్ణయానికి రండి. మీ పిల్లల్ని చదివించి వారిని ముత్యాలుగా తయారు చేయాలని ఇక్కడికొచ్చాను. మీ జీవితాలు మారాలి. అది మీ పిల్లలతోనే ప్రారంభమవ్వాలి. మీరు ఒప్పుకుంటే కలెక్టర్‌తో మాట్లాడి హాస్టల్ పెట్టించే ఏర్పాట్లు చేస్తాను. పుస్తకాలు ఉచితం. మీ లెక్క అవసరమేలేదు. మీ పిల్లల్ని నాచేతికివ్వండి. మీ పనులు మీరు చేసుకుంటూ బ్రతకండి. నేను వాళ్లను ప్రయోజకుల్ని చేస్తాను" అంది.

దూరంగా రాతిపై కూర్చున్న మూనేనాయక్ చప్పట్లు కొట్టాడు. తరువాత అందరూ కొట్టారు.

"దేవిలిని రోజూ బడికి పంపు భామీ. ఒరేయ్ పెద్దసోమ్లా... మీ భీమ్లానాయక్‌ను పంపరా! పిల్లోలన్నా బాగుపడనీ" అన్నాడు మూనేనాయక్.

"అట్నేలే. పంపుతాం" అని చాలామంది తలలూపి వెళ్లిపోయారు.

ఆ రోజు కాసేపయ్యాక ఒకమ్మాయి, అబ్బాయి వచ్చారు. రామిని, పాపది. నాలుగో తరగతిలో పేరుంది. తావ్యూనాయక్ మూడో తరగతి. లూజైన నడుం పట్టి జారిపోతే మళ్లీ పైకి లాక్కొని పురి తిప్పి బొడ్లోకి తీసుకున్నాడు తావ్యూ.

తర్వాతి రోజు ఎవ్వరూ రాలేదు. కొన్నాళ్లు పిల్లలకోసం ఎదురుచూసింది. మూనేనాయక్‌ను పిలిచి ఏం చేయాలో ఆలోచించింది. ఏదయినా చిన్న ఉత్సవంచేస్తే అందరూ ఒక చోట గుమిగూడతారని తలచింది. మూనేతో చెప్పి ఊరి చివర్న ఉన్న మాతమ్మ గుడిలో దేవర చేయడానికి ఒప్పించింది.

***

మూనేనాయక్ దేవరకు ఏర్పాట్లు చేస్తున్నాడు. మాతమ్మ గుడికి ఎర్ర మన్ను, సున్నం పట్టెలు పూయించాడు. ఎదురుగా వున్న పోలేరయ్యకు కళ్లు, మీసాలు గీయించి గంభీరంగా తయారు చేయించాడు. గుండెలు అదిరి ఝల్లుమనేలా మ్రోగించే డప్పు వాయిద్యగాళ్లను పిలిపించాడు.

ఊరంతా సున్నాలు తీసుకున్నారు. ఎర్రపట్టెలు దిద్దినారు. అందంగా ముగ్గులు పెట్టుకున్నారు.

ఆడవాళ్లంతా భర్తలు కుట్టించిన అద్దాల వస్త్రాలు సిద్ధం చేసుకున్నారు. మోచేతిదాకా తెల్లటి వెడల్పాటి గాజులు వేసుకున్నారు. సాంప్రదాయ వస్తువులంటే వాళ్లకు ప్రాణం. అదే సాంప్రదాయంతో వాళ్ల పిల్లలకు వస్త్రాలు కుట్టించారు.

దేవర మొదలైంది. డప్పులు లయబద్ధంగా మోగుతున్నాయి. మగవాళ్లు కొందరు డప్పుల లయకు చిందులేస్తున్నారు. డప్పుల వెనకల ఆడవాళ్లంతా చుట్టూ వృత్తాకారంలా చేరి లయబద్ధంగా కాళ్లు కదిలిస్తున్నారు. వారి మధ్యన పిల్లలు కోలాటం కర్రలు తీసుకుని వారి పాటను అనుసరించి టక్ టక్ శబ్దాలు చేస్తున్నారు. ఇదే కార్యక్రమం మూడుగంటలదాకా సాగింది. ఆనందం పరవశించింది.

కార్యక్రమాలన్నీ తిలకిస్తున్న సురేఖ మనసంతా ఆనందనందనమైంది. మరోవైపు ఎన్నో ప్రశ్నలు మనసులో చోటు చేసుకుంటున్నాయి.

## ఇంగ్లండ్‌లో విందు

పూర్వకాలంలో ఇంగ్లండ్‌లో ఎవరినైనా విందుకు పిలిస్తే డిన్నర్ టేబుల్‌మీద ఉపయోగించడానికి అతిథులు తమ చాకులు తామే తెచ్చుకోవాల్సి వచ్చేదిట. 16వ శతాబ్దం వరకూ ఫోర్కు అన్నది ఎవ్వరూ ఎరుగరట. ఆఖరికి 17వ శతాబ్దంలో కానీ రెంటినీ కలిపి వాడటాన్ని ఎవ్వరూ అలవాటు చేసుకోలేదుట.


## 160 కార్లు నడిచే రోడ్డు

ప్రపంచంలో అతి వెడల్పయిన రోడ్డు బ్రెజిల్‌లో ఉందిట. ఆ రోడ్డుమీద ఒకే సమయంలో 160 కార్లని పక్కపక్కన డ్రైవ్ చేసుకుంటూ వెళ్లవచ్చునట.

## విక్టర్ హ్యూగో వింత అలవాటు

ప్రఖ్యాత రచయిత విక్టర్ హ్యూగో తన మంచి బట్టల్ని తనకు కనిపించకుండా ఎక్కడేనా దాచి పెట్టమని తన నౌకరుకి చెప్పేవాడట. దాంతో బయటకెక్కడికీ వెళ్లలేక ఇంట్లోనే కూర్చుని రచనా వ్యాసంగం కొనసాగించవచ్చునని అలా చేసేవాడట.

-తటవర్తి



సాంప్రదాయాన్ని ఇంతగా గౌరవిస్తున్నారు. పాటలతో సంతోషిస్తు న్నారు. ఆనందంతో చిందులేస్తున్నారు. పిల్లలకూ అదే విధమైన ఆనం దాన్ని అందిస్తున్నారు.

మరి ఇదే విధంగా చదువులపై ఎందుకు మక్కువ చూపరు? వారి జీవి తాల్లో ఎందుకు మార్పు రావాలని కోరుకోరు? వారి పిల్లల భవిష్యత్తులో ఎందుకు వెలుగు కావాలని కోరుకోరు. వీళ్లేమీ మూర్ఖులు కారు. తెలివైన వాళ్లే.

ఈ చట్రం అవతల ఉన్న ప్రపంచాన్ని చూడకపోవడంతో వాళ్లు ఇలాగే ఉండిపోతున్నారు. వీళ్లను మార్చాలి. వీరికి విద్యాగంధాన్ని పూయాలి. వీరి జీవితాల్లో వెలుగు నింపాలి... ఇలా ఏవేవో వారికి సంబంధించిన విషయాల గురించి ఆలోచిస్తోంది.

అంతలో సురేఖ ఎదురు చూస్తున్న డిప్యూటీ డిఇఓ అక్కడికి వచ్చారు. సంతోషమేసింది. దేవర ముగిసింది.

అందరినీ గుడి ముందుకొచ్చి కూర్చోమని చెప్పింది. పిల్లలూ, పెద్దలూ కూర్చున్నారు.

డిప్యూటీ డిఇవోను పరిచయం చేసింది. వారి జీవితాలకు సంబంధించిన వివరాలన్నీ ఆయనకు వివరించింది.

డిఇవో విద్య గురించి, అందువల్ల కలిగే విజ్ఞానం గురించి వివరించారు. అక్కడే హాస్టల్ ఏర్పాటు చేస్తున్నట్లు, దుస్తులు, పుస్తకాలు ఉచితంగా ఇస్తున్నట్లు వివరించారు. పది పదిహేనేళ్లల్లో మీ పిల్లలు మంచి ప్రయోజకులు అవుతారని చెప్పాడు. పిల్లల్ని క్రమం తప్పకుండా బడికి పంపమని సూచించాడు. మాతమ్మకు నమస్కారం చేసుకుని వెళ్లిపోయాడు డిప్యూటీ డిఇవో.

★★★

మూనెనాయక్ ఆసరాతో తల్లిదండ్రుల్ని కలుస్తూ, విషయాలు వివరిస్తూ సంవత్సరం గడిపింది సురేఖ. ఫలితం శూన్యంగా అనిపించడంతో తిరుగుముఖం పట్టడానికి నిర్ణయించుకుంది సురేఖ.

ఏకాంతంగా కూర్చుని చివరగా వారి గురించి ఇంకొక్కసారి ఆలోచించింది. మెరుపులాంటి ఆలోచన తోచింది. వీరిలోనే కొందరిని తనతోపాటు తీసుకెళ్లి అక్కడ చదివిస్తే బావుంటుందనుకుంది. వస్తారో? రారో అన్న సందేహం, వస్తారన్న నమ్మకాన్ని పెంచుకుంది.

మూనెనాయక్‌ను కలిసి వివరించింది. నాలుగో తరగతి రామి, తావూనాయక్‌లను తనతో పంపడానికి ఒప్పుకున్నారు. ఇంకో ముగ్గుర్ని ఒప్పించింది.

వారి సరంజామాతో తనతో నడుస్తున్న వాళ్లను చూసి సురేఖ తన్మయత్వం చెందింది. ఇది వెలుగులోకి ప్రయాణమనుకుంది.

★★★

నాలుగు సంవత్సరాలు గడిచాయి. తనతో వచ్చిన ఐదుగురూ మంచి ముత్యాల్లా తయారయ్యారు. రామి వేసిన 'జీవనం' అన్న పెయింటింగ్‌కు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి వచ్చినప్పుడు సురేఖ, రమి జిల్లేడుకుంటకు వెళ్లారు. ఇద్దరినీ ఊరంతా ఊరేగించారు.

ఆ తరువాతి సంవత్సరంలో ముగ్గురికీ పదో తరగతిలో జిల్లా మొదటి ర్యాంకులొచ్చాయి. వారినీ జిల్లేడుకుంటకు తీసుకెళ్లింది. అందరికీ బ్రహ్మరథం పట్టారు.

మూనెనాయక్ అందరినీ సమావేశపరిచాడు. సురేఖ ఏదో చెప్పడానికని పెదవి విప్పింది. మాటలు పెగల్లేదు.. ఒక్కొక్కప్పుడు వీళ్లను తను ఏమీ చేయలేనేమోనని దిగులు పడింది.

నేను ఐదు వెలుగు పువ్వులను అదే నేలలో పూయించింది. అంతకంటే తనకేం కావాలనుకుంది. మూనెనాయక్ పూల దండ తెచ్చి పిల్లలకిచ్చాడు. వాళ్లు ఆ దండను సురేఖ మెడలో వేసారు. ఆమెలో చెప్పలేని ఆనందం.

మూనెనాయక్ మాట్లాడాడు.

"మీరు మా కళ్లు తెరిపించారమ్మా. మా బిడ్డల్ని ముత్యాల్లా చేసిన మీ రుణం తీర్చుకోలేదు. మీరు ఇక్కడే ఉండండి. మాకు జ్ఞానం వచ్చింది. మావాళ్లంతా మిమ్మల్ని కావాలనుకుంటున్నారు. మీ వెలుగు మాకు అవసరం తల్లీ'' అంటూ నమస్కరించాడు.

సురేఖ మదిలో ఆనందపు వెలుగుపూలు పూసాయి. ఐదుగురూ వెంట నడుస్తుంటే వెలుతురు ప్రపంచంలోకి సాగిపోతున్నట్లుంది.

★



## సినిమాలకు గుడ్‌బై!

హీరోయిన్‌గా బిజీగా వున్న గోపిక ఆగస్టు నెలలో పెళ్లిచేసుకుని సినిమాలకు గుడ్‌బై చెప్పేయాలనుకుంటోంది. 'ప్రేక్షకుల్లో ఆదరణ వున్నప్పుడే గౌరవంగా రిటైర్ కావడం ఉత్తమం అనుకుంటున్నాను. మరీ ఫ్లాపు లెదుర్కొంటూ సినిమాలు మానేయడం బాగోదు. అందుకనే నా కెరీర్ బ్రహ్మాండంగా వున్న సమయంలో పెళ్లి చేసుకుని గుడ్‌బై చెప్పేయడమే బెటర్' అంటోంది గోపిక. నిజమేకదా గోపిక చెప్పేది.

